# నా లో ని వా డు

ఆరోజు నాకేమీ బాగాలేదు. ఆరోజేకాదు. బి.ఎల్. ప్యాసయినప్పటినుంచీ ఇట్లాగే వుంది. పట్టా తీసుకునేరోజులు దగ్గరకు వస్తున్నకొద్దీ ఈ బాగాలేకపోవటం మరీ ఎక్కువైంది. ఇక ఎల్లుండే ఎన్‌రోల్ అవ్వాల్సిన రోజు.

ఆందోళనతో మనస్సు చీకాకు చీకాగ్గావుంది. ఆలోచనలమీద ఆలోచనలు ......

ఇదేం ప్రపంచం? కొందరు కేరింతలతో ప్రవేశిస్తున్నారు. కొందరు రోదనధ్వనులతో నిష్క్రమిస్తున్నారు. కొందరు దేవతలకుమల్లే ప్రేమలో మునిగి తేలుతున్నారు. కొందరు రాక్షసులకుమల్లే రక్తంలో ఈదులాడుతున్నారు. ధనాఢ్యుల కళకళలు. దరిద్రనారాయణుల కాకిగోల, గుసగుసలు, గిజగిజలు.

ఏమిటీ ప్రపంచం? దీన్ని ఎవ్వరు సృష్టించారు? ఎందుకు? ఎవరికోసం? ఆలోచించాను ... ఆలోచించాను ... ఆలోచించాను. ఆలోచించినకొద్దీ ఎవరో—సాయీబా— నా హృదయాన్ని దూదిపేకినట్లు ఏకుతున్నాడు. ఆలోచించటం వానికి ఇష్టంలేదని మానివేశాను. నా హృదయం, అంధకారంలోనుంచి వెలుగులోకి వచ్చినప్పుడు కళ్లు రెపరెప లాడినట్లు, రెపరెప లాడింది. మరుక్షణం కోత ......

సంఘంలో అనేకమందికంటే నేను అదృష్టవంతుణ్ణి. నన్ను వాత్సల్యంతో ఆదరించి నా తప్పులకు మురుసుకునే నాన్నగారు వున్నారు. నన్ను హృదయ పూర్వకంగా ప్రేమించి నా శ్రేయస్సుని కాంక్షించే స్నేహితులున్నారు. నన్ను అర్థంచేసుకొని, నా బాధలను—నా సుఖాలను నాకే వొదిలి—తనవిగా భావించుకునే హృదయేశ్వరి వుంది. నాకు మెదడు వుంది. కమ్మని హృదయం వుంది. కావలసినంత ఆరోగ్యముంది. 'నా కెందుకీ అవస్థ?' అని ప్రశ్నించుకున్నాను.

జవాబు లేదు.

నాలోనివాడు, 'ఈ ప్రపంచం ఒక బందిఖానా, ఆ బందిఖానాలో ఈ శరీరం ఒక చిన్న బందిఖానా. అందులో నీవు బిక్క-మొహంలో, గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నావు' అన్నాడు.

నాకు భయం వేసింది. ఎప్పుడో నా జీవితం—నాకు తెలియకుండానే—కుళ్ళిపోయిన బంగినపల్లి మామిడి పండులాగు, ఎలక్షన్ వ్యామోహంలో మురిగిన మానవుని హృదయంలాగు అయిపోతుందేమో అని కారెత్తింది.

సిగరెట్ ముట్టించాను, లాభంలేదు. పుస్తకం తీశాను-విక్టర్ హ్యూగో వ్రాసిన 'The Last Days of a Condemned Man' కంపరం పుట్టింది. జుట్టు పీక్కో-బుద్ధి అయింది.

సినిమాకి వెళ్లాను-ఫిలిం బాగుంది - డైరెక్షన్ అద్భుతంగా వుంది. కాని నా మనసు శాంతించలేదు. ప్రేమించు

కోవటం పైత్యించుకోవటం – ఇవేనా ఇప్పుడు మన దేశానికి కావలసింది ? ఈ దౌర్భాగ్య దేశంలోని వర్గకలహాన్ని ఈ సినిమాలూ పుస్తకాలూ ఎంతవరకు ప్రతిబింబిస్తున్నయ్ ? మళ్ళీ ఆలోచనలు —— ఈసారి బాల్ జాక్, టాల్ స్టాయ్, బెర్నార్డు షా, గోర్కీ ... ...

ఇక అక్కడ ఒక్క క్షణం కూర్చోలేకపోయాను. బరువు హృదయంతో బయటకు వచ్చాను. ఒక పిల్లవాడు పొట్ట కొట్టుకొంటూ, "బాబా, ఆకలి ! బాబా, ఆకలి !" అన్నాడు.

నేను వాణ్ణి తేరిపారచూశాను. వాడు పద్యం మొదలు పెట్టాడు. దాని తాత్పర్యం చెపుతాను——

"మీరు చదువు వంకతో పట్నాలు వొచ్చి వేలకు వేలు తగలేస్తున్నారు. సిగరెట్లు వూదిపారేస్తున్నారు. కాఫీ తాగుతారు. సినిమాలకు వెళ్తారు. బోగం కొంపల్లో జెలసా చేస్తారు. కాని నా సంగతి ఆలోచించరు ... ఆలోచించరు... ఆలోచించరు ..."

నాకు వికారం కలిగింది. నాలోనివాడు ప్రశ్నించాడు- "నీకింత ధనమిచ్చి, వాడికి దమ్మిడీ లేకుండా చేసింది ఎవ్వరు?"

"సంఘం" అన్నాను.

"ఎవరు సృష్టించారీ సంఘాన్ని ?"

"మానవుడు"

"ఎందుకు ? ఎవరికోసం ?"

"మానవుల కోసం"

"మరి ఇదేమిటి ?"

నేను జవాబు చెప్పలేకపోయాను. ఏదో ఘోరపాపం—హత్యలే—చేస్తున్నట్లు బాధపడ్డాను.

ఆ కుర్రవాడు 'బాబా !' అని నా పాదాలు తాకాడు. ఆ స్పర్శకు నా శరీరం మంచుకి వొణికినట్లు వొణికిపోయింది. అక్కడ వుండలేక గదికి గబగబా బయల్దేరాను. నన్ను చూచి రిక్షావాలాలు 'రిక్షాసామి, రిక్షాసామి' అని పిలిచారు. వారికి నా మొహం—ఏ మొహంపెట్టుకొని చూపించను ?-చూపించలేకపోయాను. శరీరమంతా గొంగళి పురుగులు పాకినట్లయింది. పరిగెత్తాను. ఒకటే పరుగు !

ఆరాత్రి పన్నెండు గంటలకు కన్నుమూశాను. నేనూ ఆ పిల్లవాడూ దేవుని దగ్గరకు వెళ్లాం — "దేవా ! నేనీ ప్రపంచంలో బ్రతకలేను. ఇంకొక ప్రపంచంలోకి తీసుకొని పో" అని ప్రార్థించాను.

ఆ పిల్లవాడు, "ఆకలి ... ఆకలి ... బువ్వపెట్టు ?" అని గునిశాడు.

దేవుడు నవ్వాడు. మమ్మల్నిద్దర్నీ దగ్గరకు రమ్మని పిలిచాడు. నేను నడవలేకపోయాను. ఆ పిల్లవాడు అడుగులు వేస్తూవుంటే, వాడి అంటుడొక్కలు, "మా పొత్తు గిట్టక మరో ప్రపంచం కావాలంటున్నావా ?" అంటూ ఎగిరి పడ్డవి. నేను ఉలిక్కిపడి లేచాను. మరో ప్రపంచం కావాలన్నందుకు సిగ్గువేసింది. తల వొంచుకున్నాను.

# 2

తెల్లవారింది—దిగులుతో లేచాను. దిగులుతో కాలకృత్యాలు తీర్చుకున్నాను. ఇక్కడ నాకొక స్నేహితుడున్నాడు. అతడు అద్భుతమైన తెలివితేటలు గలవాడు. కాని అతని హృదయాన్ని సంఘం ముక్కలు ముక్కలు చేసింది. ఒక ముక్క సోషలిజం అంటుంది. ఒక ముక్క జస్టిస్‌పార్టీకి ఓటివ్వమంటుంది. ఒక ముక్క కళకు సంఘశ్రేయస్సు ఆదర్శంగా ఉండాలంటుంది. ఒక ముక్క కళ కళకోసమే అంటుంది. ఒక ముక్క దేవుడు అంటుంది. ఒక ముక్క శూన్యం అస్తి అంటుంది. యశోదమ్మకు శ్రీకృష్ణుని నోటిలో పధ్నాలుగు లోకాలు కనిపిస్తే, నా కితనిలో హిందూదేశం, హిందూదేశ నాగరికతా కనిపిస్తాయి.

అతని దగ్గరకు వెళ్ళాను. అతడు మరికొందరితో కలిసి పేకాడుతున్నాడు. నాకదో ప్రపంచంగా కనిపించింది. ఆ నల్ల ఆకాశం—ఆ చిల్లర డబ్బులు నక్షత్రాలు—నోట్ల కట్టలు మేఘాలు—వారు దిక్పాలకులు.

"కూర్చో, చెయ్యిస్తాం" అన్నారు.

"ఆడను" అన్నాను.

"అయితే యిలా కూర్చొని యీ పేకాట సాల్వు చెయ్యి" అన్నాడు మిత్రుడు.

"బైటికి పద" అన్నాడు నాలోని వాడు.

"కొంచెం పనుంది. తప్పాకే వస్తాను" అని చెప్పి బయలుదేరాను.

"ప్రపంచంలో వున్న పజిల్స్ సాల్వుచేస్తే చాలు" అన్నాడు నాలోనివాడు.

"ప్రపంచంలోని పజిల్స్ సాల్వుకావు. సోపానార్ ఏం చెప్పాడు? ప్రపంచంలోని సమస్యలు పరిష్కరింపబడవు. ఎందుకంటే సమస్యలు లేకపోతే ప్రపంచమే వుండదు గనక!" అని నేను జవాబు చెప్పాను.

కాని నాలోనివాడు ఇంతటితో వూరుకోలేదు. ఏవేవో ప్రశ్నలు వేస్తూనే వున్నాడు. నేను నాకు చేతనయినట్టు జవాబులు చెప్పుకుంటూనే వున్నాను. తనువుమాత్రం కీ ఇచ్చి వదలిన యంత్రంలాగు తనంత తానే ఎక్కడికో వెళ్తూ వుంది.

తనువుకి ఒక బిచ్చగాడు అడ్డుతగిలాడు. "అయ్యా, సామీ!" అన్నాడు. అతడు వృద్ధుడు. పైగా దారిద్ర్యంతో ప్రతి అవయవం కృశించివుంది. వాడినుంచి తప్పించుకోటా నికి వేగంగా నడిచాను. వాడు నా దౌర్బల్యాం కనిపెట్టి, "అయ్యా, సామీ!" అంటూ వెంటపడ్డాడు. నేను పరి గెత్తాను.

దారిలో ఎంగిలి విస్తళ్లు ఆప్యాయంగా నాకుతున్న మనుష్యులు—వాళ్ళల్లోనూ దేవుడున్నాడు!—కనిపించారు. పెడబొబ్బలు పెట్టి ఏడుస్తున్న కుంటివాళ్ళూ, గుడ్డివాళ్లూ, కుష్ఠువాళ్లూ—వాళ్ళలోనూ దేవుడున్నాడు!—కనిపించారు. కళ్లు మూసుకొని ఉన్మత్తునివలె పరిగెత్తాను—ఎవ్వరో కిచ కిచ నవ్వారు. ఆంగ్లో యిండియన్ కన్యలై వుంటారు—గది లోకి వచ్చి పడ్డాను.

ఆ రాత్రి మళ్ళీ దేవుడు కనుపించాడు.

"మరో ప్రపంచకం కావాలా ?" అని అడిగాడు.

"అక్కర్లేదు—స్వామీ, అక్కర్లేదు. తమరు కటాక్షించి తమరి దివ్యదర్శనం యిప్పించకుండా వుంటే—అదే చాలు" అన్నాను.

"నీచుడా, ఛండాలుడా, నేను లేకపోతే నీ జన్మ వృథా...పో...పో" అని అరిచాడు దేవుడు.

నేను అదిరిపడి లేచాను భయంతో. "అమ్మా !" అని అరిచాను—చిన్నతనంలోనే అమ్మను పోగొట్టుకున్న అదృష్ట హీనుణ్ణి—"అమ్మా ! అమ్మా ! ; అమ్మా ! ! !" అంటూ ఆ రాత్రంతా ఏడ్చాను.

# 3

మళ్ళీ తెల్లవారింది—మళ్ళీ దిగులుతో లేచాను—మళ్ళీ దిగులుతో కాలకృత్యాలు తీర్చుకున్నాను. ఈనాడే నేను హైకోర్టు అధికారులచేత 'అడ్వొకేట్' ముద్ర వేయించుకునేది. అసలు హైకోర్టుకి వెళ్దామా వొద్దా అని మథన పడ్డాను.

హృదయేశ్వరి కనిపించింది. ఆమె ఒకసారి అన్నది—"పిల్లలో ."

నాన్నగారు కనిపించారు. ఆయన ఒకసారి అన్నాడు—"మావాడు లేకపోతే నా జన్మవృథా."

స్నేహితులు కనిపించారు. నాకు అడిగేవారు—
"ఎప్పుడు ప్రాక్టీసు పెడతారు ?"

దృఢ సంకల్పంతో లేచి నల్లకోటు వేసుకున్నాను. పెట్టె తెరిచి వెయ్యి రూపాయలు జేబులో పెట్టుకున్నాను. నా గదిలోని నల్లపిల్లి భయం భయంగా నా చుట్టూ తిరిగి, జాలిగా చూచి, "మ్యావ్, మ్యావ్" అన్నది.

"ఛా" అని విదిలించాను.

పాపం వెళ్ళిపోయింది.

నేను ముస్తాబై హైకోర్టుకి బయలుదేరాను. నాలోని వాడు మాట్లాడలేదు. జయించానని గర్వపడ్డాను. హైకోర్టు గేటులో ఠీవిగా అడుగుపెట్టాను.

"బాబూ ! బాబూ !"—ఎవ్వరో పిలిచారు.

దొంగలాగా బెదిరి, వెనుదిరిగి బిత్తరి చూపులు చూశాను.

"బాబూ ! బాలింతరాలిని. అయిదు రోజులనుంచీ దారకం లేదు... చంటిది చచ్చిపోతావుంది ... నా వొళ్ళు అగ్గిలాగా మండిపోతావుంది" అని జ్వరం చూడమన్నట్లు మెడచాచి, చెంప అందించింది.

నేను ఆమెను చూడలేకపోయాను. ఆమె వొంటిమీద ఎక్కడ గుడ్డవుందో, ఎక్కడ లేదో చెప్పలేను. చేతిలోని కసి గందును చూశాను. శరీరం ముచ్చెమటలు పోసింది. బుద్ధునికి బోధి చెట్టుకిందా, మహాత్మునికి బోగం కొంపలో కలిగిన

జ్ఞానం నాకీ బాలింతరాలిముందు కలుగుతుందేమో అని భయం వేసింది.

హైకోర్టువైపు మొహం తిప్పాను. అదీ ఒక వట వృక్షంలాగు కనిపించింది. అ నల్ల గౌన్లతో తిరిగేవారు, ఆ వటవృక్షాన్ని పట్టుకొని వేళ్ళాడే గబ్బిలాయిల్లాగు కనిపించారు. మరుక్షణం అదొక ప్రత్యేక ప్రపంచంలాగూ, ఆ నల్ల గౌన్లతో తిరిగే అడ్వొకేట్లుమేఘాల్లాగూ కనిపించారు. దేశానికి ఉపయోగపడే యువకులను ఎంతమందిని తన పొట్టలో పెట్టుకుంటూవుందీ యంత్రం ! !

"ఛీ !" అనుకున్నాను.

ఇంతలో హృదయేశ్వరి జ్ఞాపకం వచ్చింది.

నాన్నగారు జ్ఞాపకం వచ్చారు.

స్నేహితులు జ్ఞాపకం వచ్చారు.

ఒకడుగు ముందుకు వేశాను.

"జాగ్రత్త" అన్నాడు నాలోనివాడు.

"బాబూ" అన్నది బాలింతరాలు.

"క్యార్" మన్నది కసిగందు.

ఆ ధ్వని చూరకత్తికంటే పదునుగా నా హృదయం లోకి దిగింది. నా కళ్ళల్లో నీరు తిరిగింది. నన్ను చూచి ఆ బాలింతరాలు, "బాబూ, బాబూ ! !" అంటూ తను కూడా కంటతడి పెట్టుకుంది.

అకస్మాత్తుగా జేబులోవున్న వెయ్యి రూపాయీలు నా కళ్ళముందు తాండవించినై. వాటి బరువుతో, ఆశతో మొయ్యలేని బరువును నెత్తిన పెట్టుకున్న కూలిదానిలాగు, కుంగిపోయాను. ధైర్యంగా, వొణుకుతున్న చేతిని జేబులోకి పోనిచ్చాను;

"పిల్లలో !" అన్నది హృదయేశ్వరి.

"నా జన్మ వృధా !" అన్నారు నాన్నగారు.

"ఎప్పుడు ? ఎప్పుడు ?" అన్నారు స్నేహితులు.

నా చెయ్యి జేబులోకి పోలేదు. అలాగే వేలాడబడి పోయింది.

"జాగ్రత్త" అన్నాడు నాలోనివాడు.

"బాబూ, బాబూ !" అన్నది బాలింతరాలు.

"క్యార్" మన్నది కసికందు.

నాకు ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది. ఒక డుగు ముందుకు వేశాను. నాలోనివాడు గిజగిజా తన్నుకున్నాడు. నేను ఒక వూపుతో హైకోర్టులోకి తనువుని జేర వేశాను.

"ఓ !" అని అరిచాడు నాలోని వాడు. నాలో ఏదో పగిలి ముక్కలు ముక్కలైంది. నాలోనివాడు మరణించాడా ?